

చేతిలోని ఉత్తరం వంక మరోసారి బాధగా చూశారు ముకుందంగారు. ఆ కాగితం అతి తేలికగా ఉన్నప్పటికీ, దాని మీద ఉన్న అక్షరాలు వెయ్యి టన్నుల బరువును గుండె మీద మోపుతున్నంత బాధను కలిగిస్తున్నాయి. మూటా ముల్లే సర్దుకుని కొడుకు ఉత్తరానికి ఎదురు చూస్తున్న భార్యకు, ఆ ఉత్తరం ఎంతటి ఆశాభంగాన్ని, చిత్తక్షోభనూ కలిగిస్తుందోనన్న ఆలోచన ఆయనను మరింత క్రుంగదీసింది.

'పోస్ట్' అన్న పిలుపు వినగానే ఒళ్ళంతా చెవులు చేసుకున్న శ్యామలాంబ, ఎంతో సంబరంగా భర్త పిలుపు కోసం ఎదురు చూస్తోంది, వంటింట్లో పనుల్లో నిమగ్నమయినప్పటికీ.

ఎంతసేపటికీ భర్త నుంచి పిలుపు వినపడక పోవడంతో, ఇక ఉండబట్టలేక ఆయన కూర్చున్న కుర్చీ వద్దకు చేరుకుని "ఉత్తరేమోదో వచ్చినట్లుంది" అన్నదావిడ.

ఆవిడ మాటల వెనుక ఉన్న భావమేమిటో ఆయనకు అర్థమయింది.

"ఊఁ..." అన్నారాయన పొడిగా.

"అబ్బాయి రాసాడేమిటండీ?" ఈసారి ఆవిడ కంఠంలో కొంత ఆత్రుత ధ్వనించింది. తాపీగా చూశారు ముకుందం గారు భార్య వంక.

కొంతసేపు మౌనంగా ఉండిపోయి, ఆ తర్వాత చేతిలోని ఇన్‌లాండ్ కవరును భార్య చేతిలో పెట్టారు.

ఎంతో సంబరంగా ఆ ఉత్తరాన్ని అందుకున్న శ్యామలాంబ, అదే ఉత్సాహంతో ఆ ఉత్తరాన్ని గబగబా చదివేసింది..

ఆవిడ ఆనందం దూది పింజలా ఎగిరిపోయి, గుండెలోంచి బాధపైకి తన్నసాగింది. రెండు చేతులతో ముఖాన్ని కప్పుకుని, కూలబడిపోయిందావిడ.

ఆవిడ చేతిలోని ఉత్తరం క్రిందపడి, ఫ్యాను గాలికి ఎగిరొచ్చి ముకుందం గారి పాదాల ముందు ఆగిపోయింది.

ముందుకు వంగి, ఆ ఉత్తరాన్ని చేతుల్లోకి తీసుకుని మరోసారి ఆ ఉత్తరాన్ని చూశారాయన.

"నాన్న గారికి, నమస్కారములతో రాయునది, నేను మీ కోడలు ఇక్కడకు చేరాము. ఇల్లు కుదిరింది. ఇల్లు అనేకంటే ఓ పెద్ద గది అంటే బాగుంటుందేమో. మీరు నా ఉత్తరం కోసం ఎదురు చూస్తుంటారని నాకు తెలుసు.

ఇక్కడ యాంత్రిక జీవితానికీ, ఈ కాలపు వేగానికీ మీరు సర్దుకోవడం చాలా కష్టం. తాపీగా, ప్రశాంతంగా రోజులు గడపటమన్నది హైద్రాబాదు లాంటి మహాపట్నంలో కుదరదు. పైగా నా ఒక్కడి సంపాదనతో, మనం నలుగురం బ్రతకడం కష్టమవుతుంది. ఆర్థిక ఒత్తిడితో అశాంతి, చికాకు, కలహాలు ఏర్పడే కంటే మీరు కొంత కాలం అక్కడే ఉంటే బాగుంటుందని నా ఉద్దేశ్యం. ఆ పల్లెటూళ్ళో మీరు సుఖంగా కాలాన్ని గడపగలరు. ఇలా రాయవలసి వచ్చినందుకు నాకూ బాధగానే వుంది. అమ్మను అడిగినట్లుగానూ, మా నమస్కారాలు చెప్పండి.

అచ్యుతరామం

"ఏమండీ..." నూతిలోంచి వచ్చినట్లుగా వినిపించిందా పిలుపు.

ఆవిడ మనస్సులోని బాధను గ్రహించినట్లుగా అనునయంగా పలికారు ముకుందంగారు, "శ్యామలా! అడ్డాల నాడు బిడ్డలు కానీ, గడ్డాల నాడు బిడ్డలు కాదని పెద్దలు ఏనాడో చెప్పారు. తల్లిదండ్రులు తమకి ఏమిస్తారని కొడుకులు ఆశిస్తారే తప్ప, తల్లిదండ్రులకు తామేం చేస్తున్నామని మాత్రం ఆలోచించరు. ఈ కాలంలో ప్రతి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యేగా ఇది?"

"వృద్ధాప్యంలో బిడ్డలు తమను ఆదుకోవాలని ఆశించటం అవివేకం. ఈ పెద్దతనంలో మనకు దూరంగా వాడుంటే, ఏ రోగమొచ్చినా, నొప్పొచ్చినా మనల్ని పలకరించేవాళ్ళేరీ? ముసలితనంలో సంపాదించలేనప్పుడు కొడుకు అక్కరకొస్తాడనీ, మనల్ని పోషిస్తాడనీ, మనకు శక్తి లేకపోయినా, వాడికి పెద్ద చదువులు చెప్పించాము. వాడిని చదివించటానికి మనం ఎంత ఆర్థిక ఇబ్బందులకు గురయిందీ, కష్టపడిందీ వాడికి తెలియదటండీ?" దుఃఖంతో

కంఠం పూడుకుపోతుంటే, గొంతులోంచి మాటలు పెగలటం లేదు శ్యామలాంబగారికి.

భార్య మనసులోని ఆవేదనను గుర్తించారు ముకుందం గారు.

ఆవిడ మనస్సును మరల్చటానికి మెల్లగా అన్నారాయన, "శ్యామలా! ఆకలేస్తోంది, వడ్డిస్తావా?"

"అయ్యో నా మతి మండిపోనూ! మీరు భోజనం చేసే వేళ దాటిపోయింది. రసం కాగగానే మీకు వడ్డించేస్తాను" వేగంగా అడుగులు వేస్తూ వంటగదిలోకి వెళ్ళిపోయిందావిడ.

భార్య వెళ్లిన వైపే నిర్లిప్తంగా చూశారాయన.

దినపత్రికను చేతిలోకి తీసుకున్నా ఆయన మనస్సంతా వ్యాకులంగా వుంది. పేపరులోని విషయాలు చదివినా ఆయన బుర్రకెక్కడం లేదు.

ఆయన మనస్సు పరిపరివిధాలుగా ఆలోచించసాగింది.

పిచ్చికల అరుపులు, వాటి గోల వాటి కిచకిచ ధ్వనులు ఆయన ఆలోచనలను చెదరకొట్టాయి. తలెత్తి వెంటిలేటర్‌లో వున్న పిచ్చుకల గూడు వైపు చూపు నిలిపారాయన.

పిచ్చుకలు గడ్డి పరకను తెచ్చి గూడును కట్టడం నుంచి ప్రతి రోజూ ఓ పదినిమిషాలయినా, ఆ పిచ్చుకల వంక అవి కట్టే గూటి వంక చూడటం ఆయన దిన్య చర్యలో భాగమయింది. గూడులో గుడ్లున్నాయేమోనని, గూడు తీయకుండా ఉంచేశారాదంపతులు.

ఇంట్లో గడ్డి పరకలు, ఎండు పుల్లలూ, దారం పోగులూ, చెత్తా చెదారం పడుతున్నా, గూటి జోలికి పోలేదు, ఆ పిచ్చుకల కృషిని, ఆనందాన్ని భగ్నం చేయడం ఇష్టం లేక. పిచ్చుకలు, ఆహారాన్వేషణకు బయటకు వెళ్ళడం, తిరిగి గూడుకు చేరుకోవడం గమనిస్తుండేవారు, ముకుందంగారు. అది ఆయనకు క్రమేఫీ కాలక్షేపంగా మారిపోయింది. కొన్ని రోజులు గడిచేసరికి సన్నగా పిచ్చుక పిల్లల ధ్వనులు వినిపించసాగాయి ఆ గూటిలోంచి.

ఆ గూడు మధ్యలో పిచ్చుక పిల్లలు చేసే శబ్దాలు, పెద్ద పిచ్చుకలు పిల్లల కోసం తెచ్చిన ఆహారాన్ని పిల్లల నోటికి అందించడం, ఎగరటం చాతకాని పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవడం చూస్తుంటే, ఆయనకు అదో అద్భుత దృశ్యంలా తోచసాగింది.

కానీ ఈ రోజు పెద్ద పిచ్చుకల అరుపులతో అపశృతి, వేదన వినిపించసాగాయి. చేతిలోని దినపత్రికను పక్కన పెట్టి తల పైకెత్తి చూశారు ముకుందం గారు.

పిచ్చుక పిల్లలు ఎంతో సంబరంగా రెక్కలు విప్పుకుని గదంతా ఎగరసాగాయి. అలా కొంతసేపు గదిలో తిరిగిన పిచ్చుక పిల్లలు కిటికీలోంచి బయటకు వెళ్ళిపోయాయి, తమ గూటిని తమకు జన్మనిచ్చి, రెక్కలు వచ్చి ఎగిరే వరకూ కాపాడిన పెద్ద పిచ్చుకలను వదిలేసి. ఓ నిమిషం పాటు ఎంతో బాధగా అరుస్తూ, పెద్ద పిచ్చుకలు రెండూ గూడు చుట్టూ ప్రదక్షిణాలు చేశాయి. రెండూ కలిసి గోల గోలగా అరిచాయి. ఆ తర్వాత అవి కూడా కిటికీ లోంచి బయటకు వెళ్ళిపోయాయి.

ప్రతి రోజూ ఆ గూడు వంక చూస్తూ, పిచ్చుకల చర్యలను గమనిస్తున్న ముకుందం గారికి అర్థమయింది, రెక్కలొచ్చిన పక్షులు, తమ గూటినీ, తమ వారినీ వదిలి వెళ్ళిపోయాయని, అంతలోనే ఆయనకు జీవిత సత్యమేదో బోధపడినట్లయింది.

మూగజీవులయిన ఆ చిన్న పక్షులు. ఏ స్వార్థంతో తమ పిల్లలను రెక్కలొచ్చేవరకూ కంటికి రెప్పల్లా కాపాడాయి? ఏ స్వార్థం ఆశించి వాటికి ఆహారం తెచ్చి పెట్టాయి? తాము జన్మనిచ్చిన పిల్లలు తమ గూటినే అంటిపెట్టుకుని ఉండాలని వాటిని నిరోధించలేదే...పిల్లలను పెద్ద చేసి , తమ బాధ్యతను తీర్చుకున్నాయి.

అదే విధంగా తల్లిదండ్రులు మనస్సులో స్వార్థం లేకుండా ప్రవర్తించాలి. బిడ్డలను పెంచి, పెద్ద చేసి ప్రయోజకులను చేయడం కన్నవారి బాధ్యతగా భావించాలే తప్ప, బిడ్డలనుంచి ప్రతిఫలం ఆశించకూడదు, ప్రేమాభిమానాలు తప్ప అనుకున్నాడాయన, దృఢమయిన మనస్సుతో.

తాను రిటైరయినప్పటికీ, తన ఆరోగ్యంలో ఎటువంటి లోపమూ లేదు. కనుక ఏదయినా చిన్న ఉద్యోగం చూసుకుని, భార్యను పోషించగలడు. తమ ఇంట్లోని ఓ మూడు గదులను అద్దెకిచ్చినట్లయితే, ఆ డబ్బు భవిష్యత్తులో, వృద్ధాప్యంలో తమకు అక్కరకు వస్తుంది. అని ఆలోచించగానే కొడుకు రాసిన ఉత్తరాన్ని తలచుకుంటే ఆయనకు బాధ కలుగలేదు.

ముకుందంగారు తీసుకున్న నిర్ణయం ఆయన మనస్సును తేలిక చేసింది. భార్యకు నచ్చచెప్పి, ఆమె మనస్సుకు ఊరట కలిగించాలనుకున్నాడు, వెంటనే ఆమెకు మనో ధైర్యం కలిగించి, నిరాశను తొలగించడం తన తదుపరి కార్యక్రమం అనుకున్నాడు.

'వడ్డించానన్న భార్య పిలుపు వినిపించడంతో, ఉత్సాహంగా, ప్రశాంతంగా స్థిర చిత్తంతో వంటింటి వైపు అడుగులు వేశారు ముకుందంగారు.

## మాతృవందనం...!!!

**తెల్లదొరల పాలనకు పలికె చరమగీతం...**

*భరతమాతకు లభించె స్వతంత్ర భారతం...!*

*ఆసేతు హిమాచల పర్యంతం నేడు శుభోదయం...*

*స్వాతంత్ర్యోత్సవ వేడుకలు కడు రమణీయం..!!*

*త్యాగమూర్తుల నిస్వార్థ సేవలకు ప్రతి ఫలం...*

*సమర వీరుల అంకిత భావానికి నిదర్శనం...!*

*గాంధీజీ అహింసా యుధం విశ్వశాంతికి దర్పణం...*

*నేతాజీ 'జైహింద్' నినాదం మన విజయకేతనం..!!*

*నెహ్రూజీ అడుగుజాడలు మనకు ఆదర్శప్రాయం...*

*దేశమాత సేవకై కావాలి మనం పునరంకితం..!*

*కులమతాలకు అతీతం మన సంస్కృతీ వైభవం...*

*మన జాతి సమగ్రతే యువతరానికి స్ఫూర్తిదాయకం..!!*

*సరిహద్దుల్లో నిరంతరం యుద్ధ వాతావరణం...*

*ఉగ్రవాదుల నిరోధానికై సైన్యం సదా అప్రమత్తం...!*

*దేశరక్షణే సాయుధ బలాల అంతిమ లక్ష్యం...*

*ప్రజాస్వామ్య పరిరక్షణే భారతీయుల కర్తవ్యం..!!*

*ఎర్రకోటపై ఎగిరింది మన త్రివర్ణ పతాకం...*

*దేశరాజధానిలో పలు విన్యాసాలు నేత్ర పర్వం...!*

*బాలబాలికల దేశభక్తి నృత్యాలు ఉద్వేగభరితం...*

*భరతమాతకిదే భారతీయుల "మాతృవందనం.."!!*

**- తంగెళ్ళ పాండురంగ శర్మ**